విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నెంబర్ల మార్పు

గచ్చిబౌలి: టీజీఎస్‌పీడీసీఎల్ గచ్చిబౌలి, కొండాపూర్ డివిజన్ల పరిధిలో అధికారుల ఫోన్ నెంబర్లను మార్చినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదార్లు ఈ మార్పును గమనించాలని వారు కోరారు.

గచ్చిబౌలి ఫ్యూజ్ ఆఫ్ కాల్ – 8712469652
తారానగర్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ – 8712469653
నల్లగండ్ల ఫ్యూజ్ ఆఫ్ కాల్ – 8712469654
గచ్చిబౌలి డీఇ – 8712469627
గచ్చిబౌలి ఏడీఈ – 8712469628
గచ్చిబౌలి ఏఈ – 8712469631
తారానగర్ ఏఈ – 8712469632
నల్లగండ్ల ఏఈ – 8712469633

కొండాపూర్ డివిజన్..

కొండాపూర్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ – 8712469626
అల్లాపూర్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ – 8712469624
వైట్‌ఫీల్డ్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ – 8712469626
కొండాపూర్ డీఇ – 8712469611
కొండాపూర్ ఏడీఈ – 8712469613
కొడాపూర్ ఏఈ – 8712469618
అల్లాపూర్ ఏఈ – 8712469616
వైట్‌ఫీల్డ్ ఏఈ – 8712469622

చందానగర్ సబ్ డివిజన్ పరిధిలో..

ఏడీఈ చందానగర్ : 8712469629
ఏఈ చందానగర్ : 8712469634
ఏఈ వసంత్‌నగర్ : 8712469635
ఏఈ హాఫీజ్‌పేట్ : 8712469636
ఫ్యూజ్ ఆఫ్ కాల్ :
చందానగర్ : 8712469655
వసంత్‌నగర్ : 8712469656
హాఫీజ్‌పేట్ : 8712469657

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 15, పచ్చిమిర్చి 50 , బెండ 40, కాకర 60, దొండ 30, దోస 40, ఆలు 30, చామ 50, కీర 40, బీర 60, వంకాయ 30, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 20, క్యారెట్ 40, చిక్కుడు 90, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

కీళ్ల మార్పిడికి అత్యాధునిక చికిత్స



న్యూ జనరేషన్ రోబోటిక్ సర్జరీ వ్యవస్థను ప్రారంభించిన స్టార్ ఆస్పత్రి వైద్యులు

రాయదుర్గం: దీర్ఘకాలిక మోకాలి కీళ్ల సమస్యలతో బాధపడుతున్న రోగులకు తక్కువ నొప్పితో ఖచ్చితమైన ఫలితం, వేగవంతంగా కోలుకోవడం కోసం రూపొందించిన అత్యాధునిక ఆవిష్కరణకు నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రి శ్రీకారం చుట్టింది. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శశికాంత్ మాట్లాడుతూ తాము ప్రవేశ పెడుతున్న నూతన అత్యాధునిక రోబోటిక్ జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జరీ గేమ్ చేంజర్‌గా మారుతుందన్నారు. సీనియర్ కన్సల్టెంట్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రవీణ్ మేరెడ్డి రోబోటిక్ సర్జరీ ఎలా పనిచేస్తుందో వివరించారు.

జిన్నారం తహసీల్దార్‌గా దేవదాస్



జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం తహసీల్దార్‌గా దేవదాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సంగారెడ్డి తహసీల్దార్‌గా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన భిక్షపతి బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో భూసమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

అమీన్‌పూర్ తహసీల్దార్‌గా వెంకటేశ్


తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు: అమీన్‌పూర్ నూతన తహసీల్దార్‌గా వెంకటేశ్ బుధవారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బదిలీపై వికారాబాద్ వెళ్లారు. ఆయన స్థానంలో వికారాబాద్ నుంచి వెంకటేశ్ ఇక్కడికి బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ, అధికారులు సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అమీన్‌పూర్ పరిధిలో ప్రభుత్వ భూములు కాపాడటంలో నిరంతరం కృషి చేస్తామన్నారు. అధికారులందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.


శ్మశానవాటికలో భవన నిర్మాణ వ్యర్థాలు నింపుతున్న దృశ్యం


శ్మశానవాటికలో పేరుకు పోయిన చెత్తాచెదారం

నిధులు ఉన్నా.. పనులు సున్నా..!

తారానగర్ శ్మశానవాటిక అభివృద్ధిని పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

- నిధులు మంజూరైనా పనులు ప్రారంభించకపోవడంపై సర్వత్రా ఆగ్రహం
- సొంత డబ్బులతో పైప్‌లైన్ వేసుకున్న శ్మశానవాటిక కాపరి
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులు

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని తారానగర్ శ్మశానవాటికలో కనీస వసతులు కరువయ్యాయి. వైకుంఠ ధామంగా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. శ్మశానవాటికకు వచ్చే ప్రజలకు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రధాన గేటు లేకపోవడం, అసంపూర్తిగా భవనం నిర్మించి వదిలేయడంతో అసంఘటిత కార్యక్రమాలకు అడ్డాగా మారిపోయింది. సాయంత్రం అయితే


చందానగర్ డివిజన్ పరిధిలోని తారానగర్ శ్మశానవాటిక

చాలు తాగుబోతులకు, వ్యభిచారాని నిలయంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు.

- మరోవైపు నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో శ్మశానవాటికలోకి మురుగు వచ్చి చేరుతోంది. దీంతో తీవ్ర దుర్వాసన వస్తోందని కాలనీలో రోజురోజుకు పెరుగుతున్న జనభాకు అనుగుణంగా మౌళిక వసతుల కల్పనకు ఉన్నతాధికారులు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప పనులు మాత్రం చేపట్టడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రధానంగా వీటిపై దృష్టి పెట్టాలని డిమాండ్

- నాలా కోసం నిర్మించిన బాక్స్ కల్వర్టు ఎత్తును పెంచి మురుగు సాఫీగా వెళ్లేలా పనులు చేపట్టాలి.
- శ్మశానవాటికలో అంత్యక్రియలకు వచ్చే వారికి స్నానపు గదులు, కుళాయిలు, కనీస వసతులు ఏర్పాటు చేయాలి
- శ్మశాన వాటిలో చుట్టుగా వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.
- హస్తికలు భద్రపరించేందుకు ప్రత్యేక గదిని నిర్మించాలి.
- శ్మశానవాటికలో పనులు చేసే వారికి అక్కడే ఉండే విధంగా గదులను నిర్మించాలి.

అభివృద్ధి చేయండి



తారానగర్ శ్మశాన వాటిక అభివృద్ధి కొరకు కోటి రూపాయాల నిధులు మంజూరు అయ్యాయి. శ్మశాన వాటికలో కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైన అధికారులు శ్మశాన వాటికను వైకుంఠధామంగా తీర్చిదిద్దాలి.

– పవన్, తారానగర్

ప్రధాన గేటు లేక రక్షణ కరువు..



తారానగర్ శ్మశానవాటికకు ప్రధాన గేటు లేక తమకు రక్షణ కరువయ్యింది. వివిధ కాలనీ నుంచి వచ్చే మరుగు లోపలికి వచ్చి ఘాట్‌ల వద్ద చేరుతున్నాయి. దాని కోసం ప్రత్యేకంగా సొంత డబ్బులతో పైప్‌లైన్ వేసుకున్నా. వర్షాకాలం వస్తే శ్మశానవాటిక పూర్తిగా వరద నీటితో నిండిపోతోంది. అధికారులు మురుగు నీటి కాలువ విస్తరించి శ్మశానవాటికలోకి రాకుండా చూడాలి. అంతేకాకుండా అసంఘటిత కార్యక్రమాలు జరగకుండా పోలీసులు చూడాలి.

– బ్యాగరి అశోక్, శ్మశానవాటిక కాపరి


శ్మశానవాటికలో అసంఘటిత కార్యక్రమాలకు మారిన భవనం

- పోలీసులు అసంఘటిత కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకొని తాగుబోతులపై నిఘా పెంచాలి.

నేడు 'మనూ' ఆధ్వర్యంలో యూనిసెఫ్ మీడియా కన్సల్టేషన్

రాయదుర్గం: రోడ్డు భద్రత, వ్యవస్థల బలోపేతంపై యూనిసెఫ్ మీడియా కన్సల్టేషన్ సమావేశాన్ని గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంసీజే విభాగం డీన్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్ తెలిపారు. గురువారం వర్సిటీలోని మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం, యూనిసెఫ్, ఇండియా సహకారంతో ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ప్రత్యేక ఉపన్యాసం చేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా యూనిసెఫ్ ఇండియా చీఫ్ కమ్యూనికేషన్, పార్టనర్‌షిప్స్ చీఫ్ జాఫ్రిన్ చౌదరీ, ఐఎస్‌ఏడీఏకే సీఈఓ రోమన్‌చెసా, యూనిసెఫ్ హైదరాబాద్ చీఫ్ డాక్టర్ జెలాలెమ్ టాఫెస్సే, ఎన్‌హెచ్‌ఏఐ హైదరాబాద్ రీజనల్ ఆఫీసర్ శివశంకర్, రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ యూనిసెఫ్ ఇండియా కంట్రీ ఆఫీస్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ సయ్యద్ హబ్బి అలీ తదితరులు పాల్గొననున్నట్లు ఆయన వివరించారు.

యూరియా బదులుగా కాంప్లెక్స్ వాడండి

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో వ్యవసాయ నిపుణులు

జిన్నారం (పటాన్‌చెరు): యూరియాకు బదులుగా కాంప్లెక్స్ ఎరువులనే వాడాలని వ్యవసాయ శాస్త్ర వేత్త డాక్టర్ హేమలత రైతులకు సూచించారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమలత మాట్లాడుతూ...కాంప్లెక్స్ ఎరువుల ఉపయోగం సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యత, టమాటాలో వచ్చే సాధారణ వ్యాధులు, నర్సరీ నిర్వహణ వంటి విషయాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. వివిధరకాల సబ్సిడీలను డాక్టర్ జానకి శ్రీనాథ్ వివరించారు.

యువతకు మార్గదర్శకుడు రాజీవ్

చందానగర్: మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీ దేశంలోని యువతకు రాజకీయాల్లో మార్గదర్శకుడని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని చందానగర్ గంగారం హుడా కేఫ్ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి ఎంబీసీ చైర్మన్ జేరిపేటి జైపాల్, నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ రాజకీయాల్లో యువతకు మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. ఓటు వేసే వయస్సును 18 ఏళ్లకు తగ్గించడం, పంచాయతీ రాజ్‌ను బలోపేతం, టెలికాం, ఐటీ విప్లవం, కంప్యూటరైజేషన్, శాంతి ఒప్పందాల కొనసాగింపు, మహిళా సాధికారత, సార్వత్రిక రోగనిరోధక కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విద్యకు ప్రాధాన్యం ఇవ్వడమేగాక నూతన విద్యా విధానం అమలులోకి తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘునందన్ రెడ్డి, టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవరెడ్డి, సీనియర్ నాయకులు యాదగిరి గౌడ్, వీరేందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ రఘుపతి రెడ్డి, మహమ్మద్ అలీ, బాష్పక, నగేష్ నాయక్, మహిళలు, యువ నాయకులు పాల్గొన్నారు.


రాజీవ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జగదీశ్వర్ గౌడ్ తదితరులు

నేడు హనుమాన్ జయంతి పూజలు

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద శ్రీరంగ నాయక స్వామి వారి దేవస్థానంలో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు బుధవారం తెలిపారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఆదా చేయిస్తానని.. స్వాహా చేశాడు..

క్రెడిట్ పేరుతో రూ.38,000 టోకరా

ఫిలింనగర్: ఎస్‌బీఐ క్రికెట్ కార్డు విభాగం నుంచి ఫోన్ చేస్తున్నానని, తాను చెప్పినట్లు చేస్తే మీరు నెలవారీ డబ్బులు చెల్లించే అవసరం ఉండదని నమ్మించి అకౌంట్‌లో నుంచి రూ.38,000 కాజేసిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..ఫిలింనగర్ రోడ్డునెంబర్–9లో నివసించే ఎర్రంపల్లి సత్యం గత ఫిబ్రవరిలో ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు తీసుకున్నాడు. గత నెలలో దాని ద్వారా ఐదు లావాదేవీలు చేశాడు. ఈ నెల 17న రవి అనే వ్యక్తి అతడికి ఫోన్ చేసి మీ నెల వారీ చెల్లించే రూ.1999 మీ అకౌంట్ నుంచి కట్ కాకుండా ఉండాలంటే తాను చెప్పినట్లు చేయాలని సూచించాడు. మర్నాడు ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ప్రధాన కార్యాలయం నుంచి తన బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను తీసుకుని పరిశీలించగా నాలుగు దఫాలుగా రూ.38,000 గల్లంతైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమయోచిత చికిత్సతో ఐబీడీ కి చెక్..

సాక్షి, సిటీబ్యూరో: వరల్డ్ ఇన్‌ఫ్లమేటరీ బౌల్ డిసీజ్ (ఐబీడీ) అరుదైన వ్యాధి కాదని, అయితే నిర్లక్ష్యంతో జీవన నాణ్యతపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతుందని వైద్యులు అన్నారు. వరల్డ్ ఇన్‌ఫ్లమేటరీ బౌల్ డిసీజ్ (ఐబీడీ)డే ను పురస్కరించుకుని వైద్య సమాచార ఆరోగ్య వేదిక 'ది హెల్త్ కాన్వో' ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించింది. కొండాపూర్‌లోని వైట్ ఫీల్డ్స్‌లో ఉన్న వెస్టిన్ ఆక్వాలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డా. కె.ఎస్. సోమశేఖర్ రావు మాట్లాడుతూ 2017లో దేశంలో ఐబీడీ కేసుల సంఖ్య సుమారు 2.12 లక్షలు ఉండగా, 2020లో ఇది 5.5 లక్షలకు చేరిందనీ, 2035 నాటికి ఇది 22 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. గత కొంత కాలంగా హైదరాబాద్ నగరంతో పాటు పలు నగరాల్లో యువతలో సైతం ఐబీడీ కేసులు పెరిగిపోతున్నాయన్నారు. ప్రారంభంలోనే గుర్తించి సరైన వైద్యం అందించడం వల్ల తీవ్రమైన సమస్యల బారిన పడకుండా రోగులను కాపాడవచ్చు."అన్నారాయన. వాస్తవాధారిత ఆరోగ్య సమాచారం ప్రజలకు అందుబాటులోకి తేవడం 'ది హెల్త్ కాన్వో' లక్ష్యం," అని సంస్థ సహ వ్యవస్థాపకులు సీఈఓ వివేకానంద మిశ్రా వివరించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఆయా పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకొని ప్రగతి బాటలో పయనించాలని ఆయన పిలుపునిచ్చారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల మంజూరైన 16 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బుధవారం ఆయన నివాసంలో మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహాలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, కొత్త రేషన్ కార్డులను అర్హులైన వారందరికీ అందజేస్తుందన్నారు. ఆయా పథకాలకు అర్హత ఉన్న వారు వాటిని పొందాలన్నారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని పథకాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. వాటికి సకాలంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందిరమ్మ గృహాలు మంజూరైన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాటిని నిర్మించుకోవాలన్నారు. అధికారులు వారికి సకాలంలో డబ్బు మంజూరు అయ్యేందుకు కృషి చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, మేనేజర్ శ్రీధర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

మణికొండ: కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం గురువారం మైలార్‌దేవ్‌పల్లిలోని దుర్గా కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని మున్సిపాలిటీలు, మండలాల కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

టీఈసీలో హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు అవకాశం

పాఠశాల విద్య, నాణ్యత వర్కింగ్ గ్రూప్ సభ్యుడిగా ప్రొఫెసర్ నాగరాజు



రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్(టీఈసీ)లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్‌కు అవకాశం దక్కింది. కమిషన్‌లోని పాఠశాల విద్యా, నాణ్యతపై వర్కింగ్ గ్రూప్ సభ్యుడిగా హెచ్‌సీయూ ప్రొఫెసర్ నాగరాజు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లోని సోషియాలజీ విభాగం అధిపతిగా పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విద్యా విధానాన్ని రూపొందించేందుకు టీఈసీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కమిషన్‌కు అవసరమైన సంస్కరణలపై అధ్యయనం, సిఫార్సులను చేసేందుకు వర్కింగ్ గ్రూప్ లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా పాఠశాల విద్యలో నాణ్యతను మెరుగుపరిచేందుకు, సమస్యలను గుర్తించి సంస్కరణలను సూచించేందుకు ఏర్పాటు చేసిన గ్రూప్‌లో ప్రొఫెసర్ నాగరాజుకు అవకాశం కల్పించారు. ఈ బృందంలో ఇప్పటికే హెచ్‌సీయూ విశ్రాంత ప్రొఫెసర్ శాంతాసిన్హా, టీఐఎస్ఎస్ ప్రొఫెసర్ రేఖపప్పు ఎస్‌సీఈఆర్‌టీ హైదరాబాద్ మాజీ డైరెక్టర్, బి శేషుకుమారి ఉన్నారు. వీరందరూ గతంలో హెచ్‌సీయూతో అనుబంధం కలిగి ఉన్న వారే కావడం విశేషం.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నాలాల విస్తరణ, పూడికతీత పనులను చేపట్టాలన్నారు. వరద ముంపు నుంచి ప్రజలను రక్షించాలని కోరారు. గత పరిస్థితులను వివరించారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో కూకట్‌పల్లి ఒకటని, దీన్ని దృష్టిలో ఉంచుకొని రహదారి విస్తరణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


జోనల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న బండి రమేష్ తదితరులు

వర్షం మాటున రసాయనాల విడుదల


పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. వర్షపు నీటి మాటున గడ్డపోతారం పారిశ్రామికవాడలోని విష్ణు కెమికల్ పరిశ్రమ రసాయన వ్యర్థ జలాలను విడుదల చేసింది. పరిశ్రమ నిర్వాకంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షం కురిసినప్పుడల్లా ఇదే వ్యవహారాన్ని కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థ జలాలను విడుదల చేసిన పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, బొంతపల్లి పారిశ్రామికవాడలోని హెటిరో యూనిట్–1 పరిశ్రమ యాజమాన్యం పెద్ద ఎత్తున రసాయన వ్యర్థ జలాలను సమీపంలోని దోమడుగు నల్లకుంటలోకి విడుదల చేసింది. దీంతో స్థానికులు చెరువులు, కుంటలను వ్యర్థలతో నిండిపోయి కలుషితమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యర్థ జలాలు తాగి మూగజీవులు మృతి చెందే ప్రమాదం ఉందని వాపోయారు. ఈ వ్యవహారంపై స్థానికులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

భారీ వర్షం..

లోతట్టు ప్రాంతాలు జలమయం


కొండాపూర్‌లో రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీరు

గచ్చిబౌలి: భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బుధవారం మధ్యాహ్నం గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, కొండాపూర్, మియాపూర్, చందానగర్ ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. దాదాపు గంట పాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వరద ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

జీహెచ్‌ఎంసీ అధికారుల తక్షణ చర్యలు

భారీ వర్షం నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. గచ్చిబౌలి సర్కిల్ నుంచి ఖాజాగూడ వరకు ప్రధాన రోడ్లపై పలు చోట్ల వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ జీకేడీ ప్రసాద్, డీఈ విశాలాక్షి, ఏఈ రషీద్ వేర్వేరు ప్రాంతాల్లో పర్యటిస్తూ సిబ్బందితో కలిసి చర్యలు తీసుకున్నారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా మ్యాన్ హోళ్లను సరిచేసి వర్షపునీరు సాఫీగా వెళ్లేలా చూశారు. వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు. ముఖ్యంగా బయోడైవర్సిటీ పార్కు కూడలి, ఖాజాగూడ–ఎస్కీ లింకురోడ్డు, గచ్చిబౌలి ప్రధాన రోడ్డుపై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.


బయోడైవర్సిటీ పార్కు రోడ్డులో..


నానక్‌రాంగూడ వెళ్లే దారిలో..


గచ్చిబౌలిలోని జయభేరి పైన్‌వ్యాలీ వద్ద